సాక్షి హనుమకొండ

బుధవారం । 3 । జనవరి । 2024

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్ష ఫీజు చివరి గడువు నేడు

విద్యారణ్యపురి : జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు అపరాధ రుసుముతో పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈనెల 3వతేదీ వరకు గడువు ఉందని హనుమకొండ డీఐఈఓ ఎ.గోపాల్ మంగళవారం తెలిపారు. రూ 2,500 అపరాధ రుసుముతో ఈ పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కళాశాలల యాజమాన్యాలు గమనించి ఫీజులు చెల్లించని విద్యార్థులతో చెల్లించాలని ఆయన సూచించారు.

బావుపేట రైల్వేగేట్ రెండు రోజులు మూసివేత

కాజీపేట రూరల్: కాజీపేట –హసన్‌పర్తి రైల్వే స్టేషన్ మధ్య గల బావుపేట–కమలాపూర్‌కు వెళ్లే 9–ఈ నంబర్ రైల్వే లెవెల్ క్రాసింగ్ గేట్ ఈ నెల 4, 5వ తేదీల్లో మూసివేస్తున్నట్లు కాజీపేట రైల్వే ఇంజనీరింగ్ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడో రైల్వేలైన్ అభివృద్ధి పనుల నేపథ్యంలో ఈ గేట్‌ను రెండు రోజులపాటు మూసివేస్తున్నట్లు, ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల గుండా వెళ్లాలని వారు కోరారు.

కాళోజీ కళాక్షేత్రం పనుల్లో వేగం పెంచండి



నయీంనగర్ : కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనుల్లో వేగం పెంచి, నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం పనుల పురోగతిని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట కుడా పీఓ అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావు ఉన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 17 మంది బుక్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో కాపీయింగ్ చేస్తూ పట్టుబడిన 17 మంది విద్యార్థులపై మంగళవారం మాల్‌ప్రాక్టీస్ కింద బుక్ చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి. మల్లారెడ్డి తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 8 మంది, ఖమ్మంలో నలుగురు, ఆదిలాబాద్‌లో ఐదుగురు కాపీయింగ్ చేస్తూ పట్టుబడినట్లు పేర్కొన్నారు.

హామీలను ప్రభుత్వం నెరవేర్చాలి

- అవగాహన లేకుండా దరఖాస్తుల ముద్రణ
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



వేలేరు : కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను 100 రోజుల్లో నెరవేర్చకుంటే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హెచ్చరించారు. మల్లికుదుర్లలో సర్పంచ్ గోదెల రాజిరెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన సభలో ఆయన దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఓ సమావేశంలో మాట్లాడుతూ లంకె బిందెలు ఉన్నాయని.. సెక్రటేరియట్‌కు వస్తే ఖాళీ కుండలు ఉన్నాయనడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలను ఏ విధంగా గుర్తిస్తారని ప్రశ్నించారు. అవగాహన లేకుండా ప్రభుత్వం అభయహస్తం దరఖాస్తులను ముద్రించిందని, యువ వికాసం పథకం ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. ఎంపీపీ కేశిరెడ్డి సమ్మిరెడ్డి మాట్లాడుతూ ఓటుకు నోటు కేసులో దొరికిన రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ చేసిందని విమర్శించారు. దీంతో సభలోనే ఉన్న కాంగ్రెస్ నాయకులు వెంటనే ఎంపీపీ వ్యాఖ్యలపై అభ్యంతరం తెలిపారు. గొడవకు దిగడంతో పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చాడ సరిత, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ గోవింద సురేష్, తహసీల్దార్ కోమి, ఎంపీఓ విమల పాల్గొన్నారు.

నగరానికి చేరిన ఎస్సారెస్పీ జలాలు



హసన్‌పర్తి : ఎస్సారెస్పీ జలాలు మంగళవారం తెల్లవారుజామున నగరానికి చేరాయి. వారబందీ పద్ధతిలో మార్చి 22 వరకు నీటిని విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం లోయర్ మానేరు డ్యాంలో నీటి లభ్యత తక్కువగా ఉండడంతో చివరి ఆయకట్టు వరకు నీరందించలేకపోతున్నట్లు పేర్కొన్నారు. యాసంగిలో రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని, నీటిని పొదుపుగా వాడుకోవాలని డీఈఈ రాజు సూచించారు. అధికారులు కాల్వల వెంట గస్తీ నిర్వహిస్తున్నారని, నీటి చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

హనుమకొండ అంబేడ్కర్ జంక్షన్ సమీపంలోని పోలీస్ పెట్రోల్ బంక్ వద్ద బారులుదీరిన వాహనదారులు



పెట్రోల్‌బంక్ వద్ద కిటకిట

మోటార్ వాహన చట్టానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇటీవల నూతనంగా తీసుకొచ్చిన 140/2 జీఓను రద్దు చేయాలని పెట్రోల్, డీజిల్ ట్యాంకర్ల డ్రైవర్లు సమ్మెకు దిగారన్న సమాచారం మేరకు వాహనదారులు మంగళవారం రాత్రి పెట్రోల్ బంక్‌ల వద్ద బారులుదీరారు. సాయంత్రం వరకు నగరంలోని బంక్‌ల వద్ద సాధారణంగా ఉన్న రద్దీ.. సమ్మెకు దిగారన్న వార్తలతో ఒక్కసారిగా పెరిగింది. రోడ్డుపైకి క్యూలు కనిపించాయి. - సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, హనుమకొండ

కొత్త సంవత్సరంలో 'నామినేటెడ్'లపై గురి

- ఎమ్మెల్సీ నుంచి కార్పొరేషన్ పదవులపై ఆశలు
- బీఆర్‌ఎస్ హయాంలో ఓరుగల్లుకు పెద్దపీట.. పలు కీలక పదవుల్లో మనోళ్లు
- కాంగ్రెస్ ప్రభుత్వంలో అవకాశాల కోసం ఆ పార్టీ నేతల ప్రయత్నాలు
- హైదరాబాద్‌లో మకాం వేసిన ఆశావహులు..
- నేడు టీపీసీసీ కీలక సమావేశం.. నిర్ణయాలపై ఆశలు



ఆశలపల్లకిలో అధికార నేతలు!

సాక్షిప్రతినిధి, వరంగల్:

అధికార కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. పదేళ్లుగా అధికారానికి దూరంగా ఉన్న ఆ పార్టీ నేతలు, ద్వితీయశ్రేణి నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఎమ్మెల్సీ పదవుల రేసులో ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ రాని ఆశావహులు ముందు భాగాన ఉండగా.. ఏఐసీసీ, టీపీసీసీ పెద్దలతో సంబంధాలున్న వారు సైతం లాబీయింగ్ చేస్తున్నారు. ఢిల్లీ, హైదరాబాద్‌లో మకాం వేసి ఎమ్మెల్సీ లేదా రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవుల కోసం గట్టిగా పట్టుపడుతున్నారు. నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న ఆశావహులు ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటిసారి బుధవారం టీపీసీసీ కీలకభేటీ నిర్వహిస్తున్నది. పార్లమెంట్ ఎన్నికలు, నామినేటెడ్ పోస్టుల భర్తీ తదితర అంశాలపై చర్చ జరగనుందన్న ప్రచారం నేపథ్యంలో రెండు రోజులుగా ఆశావహ నేతలు హైదరాబాద్‌లోనే మకాం వేసి జోరుగా ప్రయత్నాలు చేస్తున్నారు.

బీఆర్‌ఎస్ హయాంలో ఓరుగల్లుకు పెద్దపీట..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నామినేటెడ్ పదవుల విషయంలో ఉమ్మడి వరంగల్‌కు ప్రాధాన్యత ఇచ్చింది. ఎమ్మెల్సీ, కార్పొరేషన్ పదవులు ఇచ్చి సీనియర్లకు సముచిత స్థానం కల్పించింది. గవర్నర్, ఎమ్మెల్యేల కోటా కింద ఎమ్మెల్సీలుగా సైతం పలువురికి చాన్స్ ఇచ్చారు. తక్కెళ్లపల్లి రవీందర్ రావు, కడియం శ్రీహరి, బస్వరాజు సారయ్య, సత్యవతి రాథోడ్, సిరికొండ మధుసూదనాచారి, బండాప్రకాశ్, పాడి కౌశిక్‌రెడ్డిలకు ఇవే కోటా కింద అప్పటి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత పాడి కౌశిక్ రెడ్డి, కడియం శ్రీహరి, పట్టభద్రుల ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రెడ్డి ఆ పదవులకు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అదే విధంగా ఉమ్మడి వరంగల్‌కు చెందిన తొమ్మిది మందికి రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు దక్కాయి. తెలంగాణ రైతు బంధు సమితి చైర్మన్‌గా తాటికొండ రాజయ్య, టీఎస్ ఆర్టీసీ చైర్మన్‌గా ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, రాష్ట్ర రైతు రుణ విమోచన సంస్థ చైర్మన్‌గా వెంకటేశ్వర్లు, రాష్ట్ర దివ్యాంగుల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా కె.వాసుదేవరెడ్డి, రెనోవెబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్(రెడ్–కో) చైర్మన్‌గా వై.సతీష్‌రెడ్డి, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా సంపత్‌కుమార్, రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా మెట్టు శ్రీనివాస్, సంగీత, నాటక అకాడమీ చైర్‌పర్సన్‌గా దీపికారెడ్డి, రాష్ట్ర జలవనరుల అభివృద్ధి చైర్మన్‌గా వీరమల్ల ప్రకాశ్‌కు పదవులు కట్టబెట్టారు. మరో కీలకమైన కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్ పోస్టు కూడా ఖాళీ అయ్యింది. జిల్లాస్థాయిలో గ్రంథాలయ సంస్థ తదితర పోస్టులు కూడా రద్దయ్యాయి. ఇప్పుడా పదవులన్నీ ఖాళీగా ఉన్నాయి. కాగా బీఆర్‌ఎస్ తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ఉమ్మడి వరంగల్‌కు నామినేటెడ్ పదవులు ఇస్తుందని పార్టీ సీనియర్లు భావిస్తున్నారు. కీలక పదవులు పొందేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

రేసులో పలువురు.. సీనియర్ల లాబీయింగ్

వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి ఎమ్మెల్సీలతోపాటు, రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్, 'కుడా' చైర్మన్ పదవులకు పెద్ద సంఖ్యలో సీనియర్లు పోటీ పడుతున్నారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్లు దక్కని వారికి ప్రాధాన్యత ఇస్తామని ఎన్నికల సందర్భంగా పలువురికి టీపీసీసీ భరోసా ఇచ్చింది. ఈ కోటాలో వేం నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి, కూచన రవళిరెడ్డి, నమిండ్ల శ్రీనివాస్, మీసాల ప్రకాశ్, తదితర నాయకులు ముందు వరుసలో ఉన్నారు. మహబూబాబాద్ నుంచి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, బెల్లయ్యనాయక్, డీసీసీ అధ్యక్షుడు భరత్‌చంద్రారెడ్డి, నూనావత్ రాధ తదితరులు కార్పొరేషన్ పదవులు ఆశిస్తున్నారు. డోర్నకల్ నుంచి మాలోతు నెహ్రూనాయక్, వీరభద్రం తదితరులు ఉన్నారు. భూపాలపల్లి నుంచి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డి, ఎన్నికలకు ముందు పార్టీలో చేరిన మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు గాజర్ల అశోక్ అలియాస్ ఐతు, కటంగూరి రాంనర్సింహారెడ్డిలు, ములుగు నుంచి డీసీసీ అధ్యక్షుడు పి.అశోక్, గొల్లపల్లి రాజేందర్, బానోతు రవిచందర్ పదవులు ఆశిస్తున్నారు. పరకాల నుంచి ఇనుగాల వెంకట్రామిరెడ్డి, హనుమకొండ నుంచి బత్తిని శ్రీనివాస్, ఎండీ.అజీజ్‌ఖాన్, అబూబక్కర్, సరళాయాదవ్, స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి అమృతరావు, సాంబయ్య, జనగామ జిల్లా నుంచి వై.సుధాకర్, వేముల్ల సత్యనారాయణరెడ్డి, సి.శ్రీనివాసరెడ్డి పేర్లు ఉన్నాయి. పాలకుర్తి నుంచి లక్ష్మీనారాయణనాయక్, ముత్తినేని సోమేశ్వరరావు, ఎస్.ప్రవీణ్‌రావు ఉన్నారు. నర్సంపేట నుంచి పాల్వాయి శ్రీనివాస్, రంజిత్‌రెడ్డి నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నారు. వీరంతా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసి తమ పేర్లను పరిశీలించాలని కూడా కోరినట్లు సమాచారం.

ఐదు గ్యారంటీలకే దరఖాస్తుల స్వీకరణ

- ప్రజాపాలన గ్రామ సభలో కలెక్టర్ సిక్తాపట్నాయక్
- రేషన్ కార్డులు, భూములకు పట్టాలు ఇప్పించాలని వినతి



ధర్మసాగర్ : మల్లక్‌పల్లిలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

ధర్మసాగర్ : ప్రజాపాలన గ్రామ, వార్డు సభల్లో ఐదు గ్యారంటీ పథకాల కోసమే దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. మల్లక్‌పల్లిలో ఎంపీడీఓ జవహర్‌రెడ్డి, ఎల్కుర్తిలో తహసీల్దార్ సదానందం ఆధ్వర్యంలో మంగళవారం ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లక్‌పల్లిలో గ్రామ సభను కలెక్టర్ సందర్శించారు. అర్హులకు రేషన్ కార్డులు ఇప్పించాలని ప్రజలు విన్నవించారు. భూములకు పట్టాలు లేకపోవడంతో రైతుబంధు రావడం లేదని, పలువురు రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డుల జారీకి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని, రేషన్ కార్డుల కోసం కూడా తెల్లకాగితంలో వివరాలు రాసి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రైతుల భూముల పట్టాల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

ప్రజాపాలన దరఖాస్తులు 1,36,336

హన్మకొండ అర్బన్ : జిల్లాలో ప్రజాపాలనకు సంబంధించి ఇప్పటి వరకు మొత్తం 1,36,336 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. వీటిలో మంగళవారం సుమారు 44,714 దరఖాస్తులు అందినట్లు పేర్కొన్నారు. కాగా, ప్రజాపాలన సభలను కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సందర్శిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

వంద శాతం దరఖాస్తులు స్వీకరించాలి

కమలాపూర్ : ఐదు గ్యారంటీ పథకాల కోసం ప్రజల నుంచి వంద శాతం దరఖాస్తులు స్వీకరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాధికా గుప్తా అధికారులను ఆదేశించారు. వంగపల్లి, మర్రిపల్లిగూడెంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలను ఆమె సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎంపీడీఓ గుండె బాబు, తహసీల్దార్ పి.మాధవి, ఎంపీఓ విమల, ఏఓ లక్ష్మారెడ్డి, ఏపీఎం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లో..

ఎల్కతుర్తి : ఎల్కతుర్తి మండల కేంద్రం, గోపాల్‌పూర్‌తోపాటు భీమదేవరపల్లి మండల కేంద్రం, ముల్కనూర్, గట్లనర్సింగాపూర్ గ్రామాల్లో అధికారులు ప్రజాపాలన సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలోని సభను ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, భీమదేవరపల్లిలో అదనపు కలెక్టర్ రాధికాగుప్తా పరిశీలించారు. వారి వెంట డీఆర్‌డీఓ శ్రీనివాస్‌కుమార్, తహసీల్దార్లు జగత్‌సింగ్, వెంకటభాస్కర్, ఎంపీడీఓలు తూర్పాటి సునీత, భాస్కర్, ఏపీఎం రవీందర్, ఏపీఓ అనిత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుభాష్‌రెడ్డి, ఏఈ లక్ష్మణ్‌నాయక్, ఏఓ అఫ్జల్‌పాషా, రాజ్‌కుమార్, ఏఈఓలు రాజు, తిరుపతి ఉన్నారు.



ఎల్కతుర్తిలో దరఖాస్తులను పరిశీలిస్తున్న ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా



కమలాపూర్ : దరఖాస్తులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

9 నుంచి సదరం శిబిరాలు

కరీమాబాద్ : దివ్యాంగుల కోసం నిర్వహిస్తున్న సదరం క్యాంపులను వినియోగించుకోవాలని డీఆర్డీఓ సంపత్‌రావు ఒక ప్రకటనలో సూచించారు. ఈ నెల 9, 12, 23, 24, 25వ తేదీల్లో ఎంజీఎం, ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 9న మానసిక దివ్యాంగులకు, 12న మూగ, చెవిటి, 23, 24, 25వ తేదీల్లో ఆర్థో విభాగాలకు సంబంధించిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బుధవారం నుంచి మీ సేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని, మధ్యాహ్నం 3 గంటల నుంచి జిల్లా సదరం స్లాట్ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

140/2 జీఓను రద్దు చేయాలి

కమలాపూర్ : మోటారు వాహన చట్టానికి కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన 140/2 జీఓను రద్దు చేయాలని హెచ్‌పీసీఎల్ లారీ డ్రైవర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు కమలాపూర్‌లోని హెచ్‌పీసీఎల్ గ్యాస్ ప్లాంట్ ఎదుట లారీ డ్రైవర్లు మంగళవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌పీసీఎల్ లారీ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ధర్ముల ప్రతాప్ మాట్లాడుతూ ప్రమాదం జరిగిన సమయంలో డ్రైవర్లు వాహనాన్ని వదిలి పారిపోతే రూ.10 లక్షల జరిమానాతోపాటు ఏడేళ్ల జైలుశిక్ష విధిస్తామని కేంద్ర ప్రభుత్వం జీఓ జారీ చేయడం సరికాదన్నారు. తాము ఏడాదంతా కష్టపడితే కూడా రూ.లక్ష సంపాదించలేమని, అలాంటిది కేంద్రం తెచ్చిన ఈ జీఓతో డ్రైవర్ పనిచేయడం కన్నా ఖాళీగా ఉండడమే మేలని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాలు తెచ్చే జీఓలు డ్రైవర్లకు అనుకూలంగా ఉండాలి కానీ అవి తమ బతుకులను ఆగం చేసే విధంగా ఉండొద్దని చెప్పారు. గతంలో తెచ్చిన జీఓలే తమకు గుదిబండగా ఉన్నాయంటే ఈ కొత్త జీఓ తమ బతుకులను మరింత ఆగం చేసే విధంగా ఉందన్నారు. డ్రైవర్లు, డ్రైవర్ల కుటుంబాలను ఆగం చేసే విధంగా ఉన్న ఈ జీఓను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, లేదంటే ఈ జీఓను రద్దు చేసేంత వరకు తమ ఆందోళనలు, సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. ఆందోళనలో యూనియన్ ఉపాధ్యక్షుడు వంగ కిరణ్, కోశాధికారి మారెళ్ల శ్రీనివాస్, నాయకులు పోతిరెడ్డి కోటి, బండి శ్రీనివాస్, చెరుకు రంజిత్, జమలాపురం సాంబరావు, బత్తిని సాయికుమార్, పెరటి రమేష్‌రెడ్డి, సంపత్, శ్రీనివాస్, శంకర్, కుమారస్వామి, లారీ డ్రైవర్లు పాల్గొన్నారు.



హెచ్‌పీసీఎల్ గ్యాస్ ప్లాంట్ ఎదుట ఆందోళన చేస్తున్న లారీ డ్రైవర్లు

గత పాలకుల అసమర్థతతోనే అప్పు

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల: గత పాలకుల అసమర్థతతోనే రూ.16 కోట్ల మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం రూ.7 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మారిందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పోచారం, వెల్లంపల్లిలో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభల్లో ఆయన మాట్లాడారు. ప్రజల ఆశీస్సులు, నమ్మకంతో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందన్నారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. తొమ్మిదిన్నర సంవత్సరాల్లో ఏ ఒక్కరికి రేషన్‌కార్డు ఇవ్వాలనే ఆలోచన బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేయకపోవడం దుర్మార్గమన్నారు. అంతేకాకుండా పేదలకు పంచిన భూములను తిరిగి స్వాధీనం చేసుకొని అన్యాయం చేసిందన్నారు. పరకాల ఎంపీపీ టి.స్వర్ణలత, పోచారం, సర్పంచ్‌లు పెండ్లి పద్మ, కృష్ణ, పోచారం ఎంపీటీసీ కోరె రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

సాంకేతిక సమస్యలు అధిగమిస్తేనే..

- ప్రభుత్వ పాఠశాలల్లో సాఫీగా ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్
- ఇప్పటికే హనుమకొండ జిల్లాలో కొనసాగుతున్న హాజరు
- జిల్లాలో 33,738 మంది విద్యార్థులు.. రిజిస్ట్రేషన్ అయ్యింది 31,893 మంది



మర్కజీ హైస్కూల్‌లో విద్యార్థుల ఫేషియల్ రికగ్నిషన్‌కు అటెండెన్స్ తీసుకుంటున్న ఉపాధ్యాయుడు


విద్యారణ్యపురి : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ తప్పనిసరిగా అమలు చేయాలని విద్యాశాఖ ఆదేశాలు జారీచేసింది. అయితే, సాంకేతిక సమస్యలతో పలు పాఠశాలల్లో ఈ ప్రక్రియకు ఆటంకం కలుగుతోంది. హనుమకొండ జిల్లాలో ప్రతిరోజు సుమారు 25 పాఠశాలల నుంచి ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా హాజరు నమోదు కావడం లేదని తెలుస్తోంది. మారుమూల ప్రాంతాల్లో నెట్‌వర్క్‌లో ఇబ్బందులు లేకుంటేనే ఇందులో సమస్యలను అధిగమించవచ్చు. నెట్‌వర్క్ బాగా ఉంటే ప్రతి తరగతి గదిలో టీచర్ విద్యార్థి అటెండెన్స్‌ను యాప్‌లో నమోదు చేయడానికి 5 నుంచి 10 నిమిషాల సమయం సరిపోతుంది. కొందరికి నమోదు కాకపోవడంతో సింగిల్‌గా విద్యార్థి ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ తీసుకోవడం సమస్య అవుతోంది. పలువురు విద్యార్థులకు ఆధార్‌కార్డులు లేకపోవడం, యూడైస్, చైల్డ్ ఇన్ఫోలో నమోదు కాకపోవడం కూడా కారణాలుగా చెప్పొచ్చు.

రిజిస్ట్రేషన్ అయినా ఇబ్బందులే

విద్యార్థులను ఫేషియల్ రికగ్నిషన్‌కు రిజిస్ట్రేషన్ చేసినప్పుడు సమస్యలు ఉత్పన్నం కాలేదు. అటెండెన్స్ తీసుకుంటున్నప్పుడు వివిధ పాఠశాలల్లో కొందరికి రికగ్నిషన్ కావడం లేదని ఉపాధ్యాయుల ద్వారా డీఈఓ కార్యాలయానికి సమాచారం అందుతోంది. మొదటి పీరియడ్‌లో కొంత సమయం హాజరుకే పోతోందనేది ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. మరోవైపు ఫేషియల్ రికగ్నిషన్ హాజరు నమోదుతోపాటు గతంలో మాదిరిగానే రిజిస్టర్‌లో కూడా అటెండెన్స్ తీసుకుంటున్నారు. 31,893 మంది విద్యార్థులకు.. మంగళవారం 20 వేలలోపే విద్యార్థులు హాజరయ్యారు. హనుమకొండ జిల్లాలో ప్రభుత్వ యాజమాన్య పరిధిలో 492 పాఠశాలలు (పీఎస్, యూపీఎస్, హైస్కూల్స్), 9 కేజీబీవీలు ఉన్నాయి. వీటిలో 33,738 మంది విద్యార్థులు చదువుతున్నారు. అందులో 31,893 మంది విద్యార్థుల ఫేషియల్ రికగ్నిషన్ రిజిస్ట్రేషన్ చేశారు. మిగిలిన విద్యార్థులు ఉన్నారా లేదా అనేది వెల్లడి కావాల్సి ఉంది. గతంలో వివిధ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా చూపించారని, కొన్నిచోట్ల ఉపాధ్యాయులు కూడా పలు సాకులు చూపి ఫేషియల్ రికగ్నిషన్ హాజరు నమోదు చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పాఠశాలల్లో ఈ విధానం ద్వారానే విద్యార్థుల సంఖ్య కచ్చితంగా తెలియడంతోపాటు పాఠశాలల వారీగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాం ఇవ్వనున్నారు. బోగస్ విద్యార్థులకు అవకాశం ఉండదు. అలాగే, తరగతి గదుల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగానే ప్రభుత్వం నిర్వహణ నిధులు అందిస్తోంది.

- హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ హైస్కూల్ ఏడో తరగతి సీ క్లాస్‌లో 51 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో 41 మంది విద్యార్థులకు ఫేషియల్ రికగ్నిషన్‌కు హాజరు నమోదు అవుతోంది. కానీ, మరో 10 మంది విద్యార్థులకు తీసుకోవడం లేదని సమాచారం.
- మడికొండ మండల పరిషత్ పాఠశాలలో 1 నుంచి 5 తరగతుల వరకు 268 మంది విద్యార్థులు ఉన్నారు. రోజు 25 నుంచి 30 మంది విద్యార్థుల ఫేషియల్ రికగ్నిషన్ సాంకేతిక లోపంతో హాజరు నమోదు కావడం లేదని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులదే బాధ్యత..



పాఠశాలలకు విద్యార్థులు సక్రమంగా హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులదే. ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ ఇక నుంచి తప్పనిసరి చేయాల్సిందే. ఏమైనా సమస్యలు ఉంటే మాదృష్టికి తీసుకురావాలి. డీఈఓ కార్యాలయంలో సిబ్బంది ఒకరిని అందుబాటులో ఉంచాం. రిజిస్ట్రేషన్ ప్రకారం విద్యార్థులు ఎక్కువ మంది రాకపోయినా, హాజరు తీసుకోకపోయినా సిబ్బంది ఫోన్ నుంచి సమాచారం హెచ్‌ఎంకు వెళ్తుంది.

- ఎండీ అబ్దుల్‌హై, హనుమకొండ డీఈఓ

క్లుప్తంగా

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య


ప్రశాంత్(ఫైల్)

వాజేడు: పెళ్లి కావడం లేదనే కారణంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని ధర్మవరంలో ఆలస్యంగా వెలుగు చూసింది. పేరూరు ఎస్సై రమేష్ కథనం ప్రకారం.. ధర్మవరం గ్రామానికి చెందిన తోట సత్యం, సరోజినీ దంపతుల రెండో కుమారుడు ప్రశాంత్(28)కు వివాహం చేయడానికి తల్లిదండ్రులు, బంధువులు సంవత్సర కాలంగా సంబంధాలు చూస్తున్నారు. కుదరక పోవడంతో తనకు ఇక పెళ్లి కాదేమోననే మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం తల్లిదండ్రులు ప్రార్థన కోసం చర్చికి వెళ్లారు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రశాంత్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చర్చి నుంచి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు కొడుకు ప్రశాంత్ విగత జీవిగా కనిపించగా బోరున విలపించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి సత్యం సోమవారం రాత్రి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ మంగళవారం తెలిపారు.

మానసిక సమస్యలతో వ్యక్తి..


నరేశ్ (ఫైల్)

కాశిబుగ్గ : మానసిక సమస్యలతో ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్ల మధ్య జరిగింది. వరంగల్ జీఆర్పీ సీఐ నరేష్ కథనం ప్రకారం.. నగరంలోని కరీమాబాద్ ఉర్సు బొడ్రాయికు చెందిన పాక్కుల నరేష్(36) ఆరేళ్లుగా మానసిక సమస్యలతో బాధపడుతూ మందులు వాడుతున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. తనను తన బామ్మర్ది భార్య కొడుతుందని సోమవారం రాత్రి మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కుటుంబీకులను స్టేషన్‌కు పిలిపించి మాట్లాడగా నరేష్‌కు మానసిక సమస్య ఉందని తెలుసుకున్నారు. అనంతరం కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. ఈ క్రమంలో నరేష్ ఇంటికి వెళ్లకుండా చిన్న బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ పి.రాజు మంగళవారం కేసు నమోదు చేసుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి భార్య రాజ్యలక్ష్మికి అప్పగించామని సీఐ నరేష్ తెలిపారు.

నితిన్ అంత్యక్రియలు పూర్తి

బచ్చన్నపేట : హైదరాబాద్‌లోని పటాన్ చెరువు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన మండలంలోని అలింపూర్‌కు చెందిన పాకాల నితిన్(18)కు కుటుంబీకులు, గ్రామస్తులు కన్నీటి వీడ్కోలు పలికారు. మంగళవారం నితిన్ మృతదేహాన్ని గ్రామం తీసుకొచ్చి అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు పూర్తి చేశారు. జేఎన్‌టీయూ విద్యార్థులు, స్నేహితులు హాజరయ్యారు. కాగా, తన తండ్రి మృతి చెందారని, తల్లి కూలీ పని చేసి తనను చదివిస్తోందని నితిన్ పలుమార్లు తెలిపేవారని స్నేహితులు పేర్కొన్నారు. తాను విద్యాభ్యాసం పూర్తి ఉన్నత ఉద్యోగం సాధించి కుటుంబానికి అండగా నిలవాలని నిరంతరం నితిన్ తమతో చెప్పేవాడని స్నేహితులు తెలిపారు. ఇంతలోనే కనిపించని లోకాలకు వెళ్లాడని కన్నీరుమున్నీరయ్యారు.

మేడారం బస్సులకు 'మహాలక్ష్మి' వర్తించేనా?

జాతరకు వచ్చే మహిళలకు ఉచిత ప్రయాణంపై సందిగ్ధంలో ఆర్టీసీ

వచ్చే నెల 21నుంచి మహాజాతర

- ఇప్పటికే సీట్ల కోసం మహిళల సిగపట్లు
- ఉచితంతో పెరగనున్న భక్తులు
- యాజమాన్యం నిర్ణయం కోసం వేచిచూస్తున్న అధికారులు

హన్మకొండ: మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన విషయం తెలిసిందే. కానీ జాతరకు నడిపే బస్సుల్లో ఈ పథకం వర్తింపజేస్తుందా.. లేదా అన్న సందిగ్ధం నెలకొంది. ఆర్టీసీ యాజమాన్యం తీసుకునే నిర్ణయం కోసం జిల్లా అధికారులు వేచిచూస్తున్నారు.

50 రోజుల్లో జాతర

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధి ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని మేడారం జాతర వచ్చే నెల 21, 22, 23, 24 తేదీల్లో జరగనుంది. ఈ జాతరకు వారం రోజుల ముందు నుంచి జాతర తర్వాత రెండు రోజులు ఆర్టీసీ బస్సులు తిప్పుతుంది. మహిళ ప్రయాణికులకు ఉచిత ప్రయాణ సౌకర్యంతో వారి కుటుంబ సభ్యులైన పురుషులు కూడా తోడుగా వెళ్తుండడంతో సంఖ్య పెరిగింది. ఇప్పటికే సీట్ల కోసం మహిళలు బస్సులో సిగపట్లు పడుతున్నారు. ఈ క్రమంలో లక్షల సంఖ్యలో భక్తులు చేరుకునే మేడారం జాతరలో పరిస్థితి ఎలా ఉంటుందో అనే ఆందోళనలో అధికారులు పడ్డారు. ఇంతకు ముందు ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేటు వాహనాలను అద్దెకు తీసుకుని కుటుంబం మొత్తం జాతరకు వెళ్లివచ్చేవారు. మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించడంతో ఈ సారి పూర్తిగా ఆర్టీసీ బస్సులపైనే ఆధారపడవచ్చనే రవాణా రంగ నిపుణులు చెబుతున్నారు. ఒకేసారి పెద్ద ఎత్తున భక్తులు వస్తే తట్టుకోగలమా అన్న మీమాంసలో పడ్డారు.


మేడారంలోని బస్టాండ్‌లో భక్తుల రద్దీ(ఫైల్)

క్రమంగా పెరుగుతున్న భక్తులు

మేడారం జాతర వారీగా ఆర్టీసీలో ప్రయాణించిన భక్తులు (లక్షల్లో)

ఏడాది	ప్రయాణికుల సంఖ్య
2014	15.32
2016	14.86
2018	17.54
2020	19.10
2022	21.00

మేడారం జాతరకు ఆర్టీసీ బస్సులో వెళ్లొచ్చేవారి సంఖ్య ఏడాదికేడాది పెరుగుతో వస్తోంది. ప్రతి జాతరకు ఆర్టీసీ ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం, అదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాతోపాటు, మహారాష్ట్ర నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతుంది. మొత్తం 51 పాయింట్ల నుంచి ప్రత్యేక బస్సులు నడిపి భక్తులను చేరవేస్తుంది. గతేడాది 3,845 బస్సులు నడపగా ఈసారి 4 వేల ప్రత్యేక బస్సులు నడిపేలా ఆర్టీసీ ప్రణాళిక సిద్ధం చేస్తోంది.

రవాణా చార్జీలపై సందిగ్ధం

జాతరకు నడిపే బస్సులకు విధించే ప్రత్యేక రవాణా చార్జీలు, మహిళలకు మహాలక్ష్మి పథకం వర్తింపజేసే విషయంపై సందిగ్ధత నెలకొంది. ప్రస్తుతం రెగ్యులర్ బస్సుల్లో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్న విషయం తెలిసిందే క్రమంలో జాతరకు అన్ని ఎక్స్‌ప్రెస్ బస్సులు నడుపుతూ ప్రత్యేక చార్జీలు వసూలు చేస్తుందా.. లేక ఉచిత ప్రయాణానికి ప్రత్యేక చార్జీలు వర్తింపజేస్తారా అనే అంశంపై ప్రభుత్వం, యాజమాన్యం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఉచిత ప్రయాణికుల సంఖ్య కచ్చితంగా లెక్కించి ఆ మేరకు ప్రభుత్వం నుంచి ఆ మొత్తం సొమ్ము రాబట్టుకునేందుకు ఆర్టీసీ జీరో టికెట్ జారీ చేస్తుంది. ఈ లెక్కన మేడారం జాతర ప్రత్యేక చార్జీలు సాధారణ చార్జీలతో చూసుకుంటే చార్జీ అధికంగా ఉంటుంది. ఈ క్రమంలో ఆ చార్జీ భారం కూడా ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయం కీలకంగా మారనుంది. కాగా, ప్రభుత్వ నిర్ణయాన్ని బట్టి ఎన్ని బస్సులు నడపాలనే అంశంపై అంచనాకు వచ్చే అవకాశముంటుందని ఆర్టీసీ వరంగల్ డిపో అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు.


హరీష్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మార్నేని

మాజీ మంత్రిని కలిసిన డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు

హన్మకొండ: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావును వరంగల్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, రాష్ట్ర రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు, టీజీఏ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవరెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు ధీరవెల్లి భరత్ కుమార్ రెడ్డి కలిశారు. మంగళవారం వారు హరీష్‌రావును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కాపువాడలో చోరీ

- రూ.2.30 లక్షల విలువైన బంగారం, రూ.8 వేల నగదు అపహరణ

వరంగల్ క్రైం : హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాపువాడలో ఓ ఇంట్లో చోరీ జరిగినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. కాపువాడకు చెందిన బొల్లం వీరభద్రస్వామి డిసెంబర్ 30న కుటుంబ సభ్యులతో కలిసి వేములవాడ, కొండగట్టు దేవస్థానాలకు వెళ్లాడు. ఈనెల 1వ తేదీన ఇంటికి వచ్చే సరికి బీరువాలో ఉన్న రూ.2.30 లక్షల విలువైన బంగారం, రూ.8 వేల నగదు కనిపించలేదు. దీంతో చోరీ జరిగినట్లు గ్రహించిన వీరభద్రస్వామి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కరుణాకర్ మంగళవారం తెలిపారు.

హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొనాలి

- వేయిస్తంభాల దేవాలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ


మాట్లాడుతున్న గంగు ఉపేంద్రశర్మ

హన్మకొండ కల్చరల్ : కోటి హనుమాన్ చాలీసా పారాయణంలో అందరూ పాల్గొనాలని, పాల్గొనలేనివారు కూడా తమ గృహాలు, దేవాలయాలు, మండపాల్లో పారాయణం చేసుకోవాలని వేయిస్తంభాల దేవాలయం ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం సౌజన్యంతో శ్రీహనుమదీక్షాపీఠం పీఠాధిపతి శ్రీశ్రీదుర్గాప్రసాద్ స్వామీజీ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ నెల 21వ తేదీన ఉదయం 7గంటలకు తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ ఔట్ డోర్ స్టేడియంలో కోటి హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం జరుగనుంది. ఈ సందర్భంగా మంగళవారం హనుమకొండ వేయిస్తంభాల దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో గంగు ఉపేంద్రశర్మ సంబంధిత కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వివిధ ప్రాంతాల పీఠాధిపతులు, స్వామీజీలు పాల్గొనే ఈ దైవకార్యాన్ని విజయవంతం చేయాలని కోరారు. తిరుపతికి రాలేని వారు తమ పేరు, గోత్రం, చిరునామా వివరాలు DHARMASAMSTHAPANA.IN వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని, 72073 77987 నంబర్‌కు వాట్సాప్ ద్వారా వివరాలు పంపొచ్చని తెలిపారు. కార్యక్రమంలో ధర్మసంస్థాపన చైర్మన్ రవికిశోర్, నర్సింగరావు, పవన్‌కుమార్ స్వామి, సంగీత్ తదితరులు పాల్గొన్నారు.

'మల్లన్న'కు ఎండోమెంట్ కమిషనర్ పూజలు


స్వామి వారికి పూజలు చేస్తున్న ఎండోమెంట్ కమిషనర్ అనిల్‌కుమార్

ఐనవోలు : ఐనవోలు మల్లికార్జునస్వామి వారిని ఎండోమెంట్ కమిషనర్ అనిల్‌కుమార్ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సంక్రాంతి నుంచి ఉగాది వరకు జరగనున్న జాతరకు ఆలయంలో చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయం చుట్టూ తిరిగిన ఆయన.. భక్తుల సౌకర్యార్థం చేస్తున్న ఏర్పాట్లను ఈఓను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సలహాలు, సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీ శ్రీకాంత్‌రావు, ఏసీ సునీత, పరిశీలకుడు సంజీవరెడ్డి, ఈఓ నాగేశ్వర్‌రావు, సూపరింటెండెంట్ కిరణ్, సిబ్బంది ఉన్నారు.


పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న డీసీపీ రవీందర్

ఐనవోలు జాతర ఏర్పాట్ల పరిశీలన

సంక్రాంతి నుంచి ఉగాది పర్వదినం వరకు జరగబోయే ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర ఏర్పాట్లను మంగళవారం ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, మామునూర్ ఏసీపీ సతీష్‌బాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేస్తున్న వీఐపీ, సాధారణ, ప్రత్యేక క్యూల ను ఆయన పరిశీలించారు. భక్తుల సౌకర్యార్థం చేపట్టాల్సిన చర్యలను అధికారులకు సూచించారు. అనంతరం చెక్‌పోస్టుల ఏర్పాటుపై చర్చించారు. పార్కింగ్ స్థలాలను పరిశీలించి భక్తులకు ఇబ్బంది కలుగకుండా సరైన వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానిక సీఐ శ్రీనివాస్, ఎస్సై నవీన్‌కుమార్‌కు సూచించారు. ఈ సందర్భంగా పలుఅంశాలపై స్థానిక పోలీసులకు సలహాలు ఇచ్చారు.

పర్యావరణంపై అవగాహన కోసం సైకిల్ యాత్ర

- 18 రాష్ట్రాల మీదుగా ప్రయాణం..
- యాత్రకు పాలకుర్తిలో ఘన స్వాగతం

పాలకుర్తి: ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడానికి హరియాణ రాష్ట్రానికి చెందిన యువకుడు అజయ్‌కుమార్ చేపట్టిన సైకిల్ యాత్ర మంగళవారం పాలకుర్తి మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా యాత్రకు పలువురు ఘన స్వాగతం పలికారు. అనంతరం అజయ్‌కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడానికి 2022, డిసెంబర్ 10వ తేదీన సైకిల్ యాత్ర చేపట్టానన్నారు. 18 రాష్ట్రాల మీదుగా చేపట్టిన ఈ యాత్ర ప్రస్తుతానికి 15 వేల కిలోమీటర్ల పూర్తయిందన్నారు. కాగా, పాలకుర్తి రాజీవ్ చౌరస్తాలో అజయ్ కుమార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బహుజన కులాల ఐక్య వేదిక నాయకుడు సాంబరాజు, యూట్యూబ్ చానల్ నిర్వాహకుడు చెరిపల్లి అశోక్, మంచుప్పుల సర్పంచ్ కొమురయ్య, పాలకుర్తి ఉప సర్పంచ్ తరాల చంద్రబాబు, ముత్తారం ఎంపీటీసీ బొమ్మగాని మానస భాస్కర్, గాదెపాక ఎల్లయ్య, గాదెపాక సోము, నలమాస రమేష్, లెనిన్, వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న గోవుల పట్టివేత



తొర్రూరు: అక్రమంగా తరలిస్తున్న గోవులను భజరంగ్‌దళ్ కార్యకర్తలు పట్టుకున్నారు. ఈ ఘటన మంగళవారం రాత్రి డివిజన్ కేంద్రంలో జరిగింది. డీసీఎంలో గోవులను తరలిస్తున్నారనే సమాచారం అందుకున్న భజరంగ్‌దళ్ కార్యకర్తలు.. పట్టణ శివారులో వ్యాన్‌ను పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించి వ్యాన్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డీసీఎంలో 24 గోవులు ఉన్నట్లు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిఘా.. నిల్

- కొరవడిన పోలీసుల పర్యవేక్షణ
- పేట్రేగుతున్న యువత, రౌడీలు
- పెరిగిన చోరీలు, దాడులు
- యథేచ్ఛగా మత్తు పదార్థాల విక్రయాలు
- ప్రశ్నిస్తే ఇళ్లపై దాడులు.. బెంబేలెత్తుతున్న స్థానికులు

ఖిలా వరంగల్: నగరంలో పోలీస్ నిఘా కొరవడింది. దీంతో యువత పెట్రేగిపోతోంది. గంజాయి, మద్యం మత్తులో ఉంటున్న వీరు.. దారిన వెళ్లే వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే ఇళ్లపై దాడులు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల నగరంలో దోపిడీలు, చోరీలు, మహిళలపై అఘాయిత్యాలు, దాడులు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. దీనికి కారణం నిఘా లేకపోవడమేననే నగర వాసులు పేర్కొంటున్నారు. మిల్స్‌కాలనీ పీఎస్ పరిధిలో గతేడాది నవంబర్ చివరి వారంలో ఓ ఇంటిపై దాడి చేసి ముగ్గురిని గాయపర్చిన ఘటన కలకలం రేపింది. ఈఘటన మరువక ముందే ఇదే స్టేషన్ పరిధిలో గత నెలలో తాళం వేసిన ఇంట్లో దుండగలు చోరీకి పాల్పడి 80 తులాల బంగారం, రూ.7లక్షల నగదును దోచుకెళ్లారు. అలాగే, శిథిల ఇళ్లు, నిర్జీవ ప్రదేశాలు, ముళ్లపొదలను స్థావరాలుగా ఏర్పాటు చేసుకుని యథేచ్ఛగా పేకాట ఆడుతున్నారు. ఇదిలా ఉండగా నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఆదివారం అర్ధరాత్రి పలు డివిజన్లలో యువత మద్యం మత్తులో రెచ్చిపోయింది. రహదారులపై కత్తులతోనే సయ్యాటలాడింది. ఓ యువకుడిపై పాత నేరస్తులు దాడి చేసి విచక్షణారహితంగా కత్తులతోపొడిచి తీవ్రంగా గాయపరిచారు. అదే రోజు మరో ఘటన జరిగింది. కొందరు యువకులు మద్యం మత్తులో రోడ్డుపై తిష్టవేసి దుర్భాషలాడటం.. ఏదేమిటని ప్రశ్నిస్తే ఓ వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ ఘటనలపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారిపై కేసులు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలుస్తోంది.


గాయాలతో ఆస్పత్రిలో మహేందర్ (ఫైల్)

రౌడీలపై కొరవడిన నిఘా..!

నగరంలో పోకిరీలు, ఆకతాయిలు, రౌడీ షీటర్లపై పోలీసు నిఘా కొరవడిందనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. వారంలో ఒక రోజు ప్రతీ పోలీస్ స్టేషన్‌లోనూ నిర్వహించే కౌన్సెలింగ్‌కు రౌడీషీటర్లు హాజరుకాకపోయినా వారిపై చర్యలు తీసుకోవడం లేదు. దీంతో పలువురు నేరస్తులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు ఇప్పటికైనా వరుస ఘటనలు చూసి పకడ్బందీ నిఘా ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో పోకిరీలు, ఆకతాయిలు, రౌడీషీటర్ల చర్యలతో ప్రజలు ఇబ్బందులు పడే ప్రమాదం పొంచి ఉందని పలువురు నగర వాసులు పేర్కొంటున్నారు.

రోడ్డు దాటుతూ..అనంతలోకాలకు..

కారు ఢీకొని బాలుడి దుర్మరణం

- ముత్యాలమ్మగూడెంలో ఘటన
- శోకసంద్రంలో కుటుంబం


విజయప్రకాష్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : అప్పటిదాకా తల్లిదండ్రులు, తమ్ముడితో కలిసి ఆనందంగా గడిపిన ఆ బాలుడు క్షణకాలంలో కడుపు కోత మిగిల్చాడు. రెప్పపాటు కాలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మయాదారి మృత్యువు కారు రూపంలో బాలుడిని బలితీసుకుంది. దీంతో కళ్లెదుటే తమ కుమారుడు కనిపించని లోకాలకు వెళ్లడంతో తల్లిదండ్రులు రోదనలు మిన్నంటాయి. ఈ ఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి ముత్యాలమ్మగూడెం గ్రామ శివారులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మచ్చర్ల గ్రామానికి చెందిన చింత సుధాకర్, వినోద దంపతులకు ఇద్దరు కుమారులు విజయప్రకాష్ (8), జ్ఞానప్రకాష్ ఉన్నారు. బతుకుదెరువు నిమిత్తం సుధాకర్ కుటుంబం హైదరాబాద్ వెళ్లి కూలి పని చేసుకుని అక్కడే జీవిస్తోంది. తమ స్వగ్రామంలో పని ఉండగా సోమవారం రాత్రి హైదరాబాద్ నుంచి రైలులో మహబూబాబాద్ చేరుకున్నారు. రాత్రి కావడంతో ముత్యాలమ్మగూడెంలోని తమ బంధువుల ఇంట్లో బస చేశారు. మంగళవారం ఉదయం మచ్చర్లకు వెళ్లడానికి సుధాకర్ కుటుంబం ముత్యాలమ్మగూడెం క్రాస్ వద్ద నిలుచున్నారు. ఈ క్రమంలో బస్సు వస్తున్న విషయాన్ని గమనించి పెద్ద కుమారుడు విజయప్రకాష్ తల్లిదండ్రులతో చెప్పాడు. వెంటనే వారు నడుచుకుంటూ రోడ్డు దాటుతున్నారు.ఈ క్రమంలో గూడూరు వైపు నుంచి మహబూబాబాద్ వైపునకు వస్తున్న ఓ కారు.. బాలుడిని ఢీకొనగా తీవ్ర గాయాలయ్యాయి. అటు వైపు వెళ్తున్న అటవీశాఖ మానుకోట రేంజ్ అధికారి జ్యోత్స్నదేవి ప్రమాదం చూసి తన వాహనంలో బాలుడిని చికిత్స నిమిత్తం మానుకోట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. బాలుడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు.


రోదిస్తున్న తల్లి వినోద, బంధువులు

కారు డ్రైవర్‌పై కేసు

మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ముత్యాలమ్మగూడెం గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడు విజయప్రకాష్ మృతికి కారణమైన కారు డ్రైవర్ గుగులోత్ రాజ్ కుమార్ పై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని రూరల్ ఎస్సై వీ.దీపికారెడ్డి మంగళవారం రాత్రి తెలిపారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం గొల్లపల్లి గ్రామ శివారు రాముతండాకు చెందిన రాజ్ కుమార్, వారి బంధువులు కారులో గూడూరు మీదుగా మహబూబాబాద్ వస్తుండగా ప్రమాదం జరిగినట్లు గుర్తించామని పేర్కొన్నారు.

వడిచర్ల సమీపంలో యువకుడు..


నరేష్ (ఫైల్)

లింగాలఘణపురం: జనగామ – సూర్యాపేట రహదారిపై వడిచర్ల సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లాకు చెందిన కిలోత్ నరేష్ (32) దుర్మరణం చెందాడు. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మరిపెడకు చెందిన నరేశ్ కుటుంబం హైదరాబాద్‌లోని మల్కాజిగిరి ప్రాంతంలో ఉంటోంది. తన వదిన కవితతో కలిసి ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకొనేందుకు స్వగ్రామం వచ్చారు. అనంతరం ద్విచక్రవాహనంపై హైదరాబాద్ వెళ్తుండగా వడిచర్ల సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొన్నాడు. దీంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కవితకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడికి భార్య విమల, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

భార్య మృతదేహం తీసుకురావొద్దని ఇంటికి తాళం

- భర్త, అత్తామామ ఘాతుకం
- ధర్మారంలో ఘటన


లక్ష్మి (ఫైల్)

నడికూడ : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందింది. అయితే ఆమె మృతదేహాన్ని ఇంటికి తీసుకురావొద్దని భర్త, అత్తామామ ఇంటికి తాళం వేశారు. ఈ ఘటన మండలంలోని ధర్మారంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నక్క లక్ష్మి (28) గత నెల 28న ధర్మారం బస్టాప్ వద్ద గుర్తు తెలియని లారీ ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. మంగళవారం లక్ష్మి మృతదేహం తీసుకురాగా భర్త, అత్తామామ ఇంటికి తాళం వేశారు. దీంతో ఆగ్రహించిన బంధువులు ఇంటి ఎదుట మృతదేహం వేసి ఆందోళన చేపట్టారు. అనంతరం న్యాయం చేయాలని కోరుతూ ధర్మారం బస్టాప్ వద్ద నిరసన చేపట్టారు. దీంతో పరకాల–అంబాల రహదారిపై సుమారు 3 గంటలు ట్రాఫిక్ జామ్ కావడంతో పరకాల సీఐ వెంటరత్నం, ఎస్సైలు రమేష్, రవికుమార్, శివకృష్ణ ఘటనా స్థలికి చేరుకొని ఆందోళనకారులతో చర్చించి ఆందోళన విరమింపజేశారు. కాగా, నక్క ఎర్రయ్యకు ఇద్దరు భార్యలు. ఇందులో లక్ష్మి మెదటి భార్య. కుటుంబ కలహాల నేపథ్యంలో లక్ష్మి కొన్ని రోజుల నుంచి ధర్మారంలోనే వేరే ఇంట్లో అద్దెకు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనపై మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంటరత్నం తెలిపారు. కాగా, ఆందోళన సమయంలో పోలీసుల తోపులాటలో ఓ వృద్ధురాలికి స్వల్పగాయమైంది.


ఆందోళన చేస్తున్న బంధువులు

'నర్సంపేట కథలు' పుస్తకావిష్కరణ

హన్మకొండ: టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ కన్‌స్ట్రక్షన్ ఏఈ, తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసో సియేషన్ సర్కిల్ సెక్రటరీ ఎం.అనిల్ కుమార్‌రెడ్డి రచించిన నర్సంపేట కథలు పుస్తకాన్ని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆవిష్కరించారు. మంగళవారం హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలోని చాంబర్‌లో పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రచయిత ఎం.అనిల్ కుమార్‌రెడ్డి, అసోసియేషన్ ఎన్పీడీసీఎల్ శాఖ అధ్యక్షుడు ఎం.ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి నార్ల సుబ్రహ్మణ్యేశ్వర రావు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ పి.మల్లికార్జున్, నాయకులు జ్యోతిర్మయి, టి.వంశీకృష్ణ, కె.రాజు, బి.సతీష్, వరుణ్ పాల్గొన్నారు.


నర్సంపేట కథలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

చికిత్స పొందుతున్న ట్రాక్టర్ డ్రైవర్ మృతి


నాగరాజు (ఫైల్)

మరిపెడ రూరల్: ఇటీవల కుక్క కాటుకు గురైన ఓ ట్రాక్టర్ డ్రైవర్ హైదరాబాద్ ఎర్రగడ్డ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎడ్జెర్ల గ్రామానికి చెందిన ఎలగం శ్రీను, సైదమ్మ దంపతుల కుమారుడు నాగరాజు (27) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గత నెల 10వ తేదీన గ్రామంలో కుక్క కాటుకు గురయ్యాడు. చికిత్స నిమిత్తం మరుసటి రోజు మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చాడు. వైద్యుడు పరీక్షించి మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి రెఫర్ చేయగా అక్కడ చికిత్స పొందాడు. అయినా వ్యాధి తగ్గక పోవడంతో కుటుంబీకులు మళ్లీ మహబూబాబాద్ తరలించారు. వైద్యులు పరీక్షించి నాగరాజును హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నాగరాజు మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటనపై గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో కుక్కల బెడదను అరికట్టాలని వారు కోరుతున్నారు.